క్లుప్తంగా

వైభవంగా వేంకటేశ్వరుని ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

బోట్‌క్లబ్: స్థానిక జగన్నాథపురంలోని భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం రాత్రి ఏడు గంటలకు స్వామి వారి దివ్య కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఈఓ సత్యవేణి తెలిపారు.

వైద్య ఖర్చులకు విద్యార్థికి రూ.లక్ష 'చేయూత'


విద్యార్థి తండ్రికి చెక్కును అందజేస్తున్న చేయూత సంస్థ ప్రతినిధులు

కాకినాడ సిటీ: కాకినాడ జగన్నాథపురానికి చెందిన పదో తరగతి విద్యార్థి లుకేమియా వ్యాధితో బాధపడుతున్న సందర్భంగా వైద్య ఖర్చుల నిమిత్తం చేయూత సంస్థ ప్రతినిధి రవి కుమార్ బృందం రూ.లక్ష అందజేశారు. ఈ చెక్కును శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావుల సమక్షంలో విద్యార్థి తండ్రికి అందించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా చేయూత సంస్థ అధ్యక్షురాలు సురభీ శారద, సైన్స్ విభాగ అధ్యక్షులు వినీల్, సభ్యులు చింతా పవన్ కళ్యాణ్, శ్రీమాన్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువు లీజు హక్కు వేలం వాయిదా

కాకినాడ రూరల్: సర్పవరం భావనారాయణ స్వామి ఆలయానికి చెందిన చేపల చెరువులో లీజు హక్కు కోసం మూడు నెలల గడువుతో శుక్రవారం నిర్వహించిన టెండర్ కమ్ బహిరంగ వేలంను అధికారులు వాయిదా వేశారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం మూడు గంటలకు ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ, వేలం పాటకు పర్యవేక్షకుడిగా హాజరైన మురళీ వీరభద్రరావు, ఇన్‌స్పెక్టారు ఫణీంద్రకుమార్ వేలం కోసం టెండర్లను ఆహ్వానించారు. టెండరు ప్రకటనలో ఆలయం ఉత్తరం వైపు ఎదురుగా ఉన్న ముక్తిక సరస్సుగా పేర్కొనడంతో ఏ విధంగా వేలం వేస్తారని కొందరు, పక్కనే ఉన్న చెరువు అని పేర్కొనాలని సూచించారు. మూడు నెలల గడువుపై పలువురు నిలదీయడంతో అధికారులు వేలంను వాయిదా వేశారు. మరోసారి వేసేటప్పుడు చేపల చేరువు గురించి పేర్కొనేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

బోట్‌క్లబ్: పెట్రోల్, డీజిల్, విద్యుత్, వంటగ్యాస్ చమురు ధరలు, రవాణా చార్జీలు అధికంగా ఉండడంతో నిత్యావసర వస్తువులు ధరలు కట్టడి లేకుండా తీవ్రంగా పెరుగుతున్నాయని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు శుక్రవారం ఒక ప్రకటనలో వాపోయారు. గత సంవత్సరం నవంబర్ నుంచి ధరలు విపరీతంగా పెరగడంతో సాధారణ, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్‌పై విధిస్తున్న జీఎస్టీని తగ్గించి విద్యుత్ ట్రూ అప్ భారాలు రద్దు చేయాలన్నారు. ధరలు తగ్గించకుంటే సామాన్య, మధ్యతరగతి కుటుంబాల్లో తలసరి పొదుపు తగ్గి మితిమీరిన అప్పులు నెలనెలా పెరిగిపోతున్నాయన్నారు.

భీష్మ ఏకాదశికి ముస్తాబైన వైష్ణవ ఆలయాలు

బోట్‌క్లబ్: భీష్మ ఏకాదశి సందర్భంగా నగరంలోని పలు వైష్ణవ ఆలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి.భక్తులకు స్వామివారి దర్శనం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. స్థానిక గాంధీనగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. తెల్లవారుజాము నుంచి దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు దాతల సహకారంతో ప్రసాదం పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక సాంబమూర్తినగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక జగన్నాథపురంలో విష్ణ్వాలయం, మెహర్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో, వేంకట్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

బాలికల భవితకు బాటలు

- బాలికల కోసం కిశోరి వికాసం కార్యక్రమం
- సంపూర్ణ సాధికారతే లక్ష్యంగా వివిధ కార్యక్రమాలు
- మహిళాశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ


టీఓటీలుగా శిక్షణ పొందిన అంగన్‌వాడీ సిబ్బంది


కిశోరి వికాసం సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

కాకినాడ క్రైం: కిశోరి బాలికల భవితకు బంగారు బాటలు వేసే బృహత్కార్యానికి అంకురార్పణ పడింది. 'కిశోరి వికాసం' పేరుతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం సంపూర్ణ సాధికారతే లక్ష్యంగా కొనసాగుతోంది. ప్రతి బాలికను పలుకరిస్తూ ఆమె భవిత, భద్రతకు భరోసానిస్తోంది. ఐసీడీఎస్ పీడీ విజయకుమారి ఆధ్వర్యంలో సీడీపీవో(చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్)లు పర్యవేక్షకులుగా కాకినాడ పరిధిలో కిశోరి వికాసం కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది.

ఈ దశలోనే..

కిశోరి వికాసం కార్యక్రమం 11 ఏళ్ల నుంచి 18 ఏళ్ల మధ్య వయసున్న కౌమర దశ బాలికల కోసం అమలు చేశారు. ఈ దశ నుంచే బాలికలను సన్మార్గంలో ఉంచేందుకు సరికొత్త కార్యక్రమాలు రూపొందించారు. లింగ వివక్షత, సంపూర్ణ ఆరోగ్యం, నాణ్యమైన విద్య, వ్యక్తిగత, రుతుస్రావ పరిశుభ్రత, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, బాల్య వివాహాలను అరికట్టడం, మానవ అక్రమ రవాణా, ఆత్మ రక్షణ, నైపుణ్యం ఉపాధి వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకు గ్రూప్స్ విధానాన్ని ఎంచుకున్నారు. ప్రత్యేక పుస్తకాలు ముద్రించి పంచి వారి భవితకు తోడ్పాటును అందిస్తున్నారు. ఈ కార్యక్రమాలు మహిళా శిశు సంక్షేమ శాఖ, గ్రామీణ అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ), మెప్మా, వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, పోలీస్ శాఖ ఇలా ఆరు శాఖల సమన్వయంతో జరుగుతోంది.

టీఓటీలకు శిక్షణలు

బాలికల్లో విషయావగాహన పెంపొందించడం కోసం వివిధ విభాగాలకు చెందిన మండల స్థాయి సిబ్బంది, అధికారులకు కాకినాడ అర్బన్ గ్రామీణ పరిధిలో ఉన్న సీడీపీవోల ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణనిచ్చారు. శిక్షణ పొందిన వారిలో టీచర్లు, వీఆర్వోలు, మెప్మా వీవోలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, జీఎంఎస్‌కేలు, ఎన్‌జీవోలు ఉన్నారు. వీరిని టీఓటీ(ట్రైనర్స్ ఆఫ్ ట్రెనీస్)లుగా పిలుస్తారు. వీరు కిశోర బాలికలకు భద్రతపై వివరిస్తారు.

15 మంది ఒక గ్రూపుగా..

కాకినాడ అర్బన్ గ్రామీణ మండలాల సీడీపీవోలు జ్యోతి, వై.లక్ష్మిల ఆధ్వర్యంలో టీఓటీలు పర్యవేక్షణలో కిశోరి వికాసం కార్యక్రమాల నిర్వహణ జరుగుతోంది. పాఠశాల విద్యార్థులను లింగ, వయో వర్గాలుగా విభజిస్తున్నారు. బాలికలు ఒక గ్రూపు, బాలలు మరో గ్రూపుగా ఏర్పాటు చేశారు. అలాగే 11 ఏళ్ల నుంచి 14 ఏళ్ల వయసు లోపు వారు ఒక గ్రూపు, 15 ఏళ్ల నుంచి 18 ఏళ్ల మధ్య వయసున్న బాలలు, బాలికలు మరో గ్రూపుగా ఏర్పాటు చేస్తున్నారు. గ్రూపుల సంఖ్యకు ఎటువంటి పరిమితి లేదు. ఇలా విద్యాలయాల కేంద్రంగా గ్రూపులు సిద్ధం కావడంతో పాటు పాఠశాలలకు రాని వారు లక్ష్యంగా గ్రామాలు, వార్డుల వారీగా గ్రూపులు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా కాకినాడ గ్రామీణ మండలం పరిధిలో జల్లెడ పడితే 10 నుంచి 15 మంది బాలలను గుర్తించి వారి కోసం గ్రూపులు సిద్ధం చేశామని రూరల్ సీడీపీవో వై.లక్ష్మి తెలిపారు. ఇలా గ్రూపులుగా ఏర్పడిన వారందరికీ ప్రత్యేకంగా కిశోర వికాసం పుస్తకాలు అందిస్తున్నారు. ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆత్మరక్షణ చర్యలతోపాటు, ఆహారం, ఆరోగ్యం తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.

> **36 వారాల ప్రోగ్రాం**
>
> కిశోరి వికాసం 36 వారాల ప్రత్యేక కార్యక్రమం. గత ఏడాది నవంబర్ 21వ తేదీన ప్రారంభమైంది. ఇప్పటికి సుమారు పదివారాలు గడిచింది. లక్ష్యాన్ని మించిన ఫలితాలు రాబడుతున్నాం. మరింతగా విస్తరించాల్సి ఉంది. కాకినాడ పరిధిలో నిర్వహించడంతో సీడీపీవోలు జ్యోతి, లక్ష్మితోపాటు టీఓటీల కృషి ఎంతైనా ఉంది. బాలికల సంపూర్ణ సాధికారితే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ షన్‌మోహన్ పర్యవేక్షణలో కార్యక్రమాన్ని నిరాటంకంగా కొనసాగిస్తున్నాం.
>
> – కె.విజయకుమారి, ఐసీడీఎస్ పీడీ

గీత కార్మికుడి మృతి

కరప: తాడిచెట్టు ఎక్కి, పైన ఉండగానే గుండెపోటుతో కల్లుగీత కార్మికుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన కరప శివారు రామకంచిరాజునగర్ కాలనీలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామశివారు రామకంచిరాజునగర్ కాలనీకి చెందిన పెంకే శ్రీనివాస్(43) కల్లుగీత కార్మికుడు గురువారం సాయంత్రం కల్లు కోసం తాడిచెట్టు ఎక్కాడు. చెట్టుపైనుండగానే గుండెపోటు రావడంతో మృతి చెంది, చెట్టుకు వేలాడుతూ ఉండడంతో కొంతసేపటికి ఆ ప్రాంతం వారు గమనించి, మృతదేహాన్ని కిందికి దించారు. వెంటనే వైద్యులను పిలవగా, అప్పటికే మృతిచెందినట్టు ధ్రువీకరించారు. శ్రీనివాస్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పెంకే సత్తిబాబు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, సంతాపం వ్యక్తంచేశారు.

బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు టీషర్టుల బహూకరణ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఈనెల 8, 9 తేదీల్లో వరంగ్ జిల్లాలో జరగనున్న ఉభయ తెలుగు రాష్ట్రాల ఓపెన్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు క్రీడాకారులకు శుక్రవారం టీషర్టులు అందజేశారు. సానా సతీస్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ అందించిన ఈ టీషర్టులను డీఎస్ఏ క్రీడామైదానంలోని సిటీ బాల్‌బ్యాడ్మింటన్ క్లబ్ నాయకుడు దొంతమూరి అశోక్ కుమార్ పంపిణీ చేశారు.

సామూహికంగా ఎలుకలను నిర్మూలించాలి


నేమాంలో రైతులకు ఎలుకల మందును అందజేస్తున్న వ్యవసాయాధికారి విజయ్‌కుమార్


కరప ఆర్‌ఎస్‌కే వద్ద రైతులకు ఎలుకల మందు అందజేస్తున్న ఏడీఏ బాబూరావు, ఎంఏఓ రాజేష్

కాకినాడ రూరల్: రైతులు ఎలుకల నిర్మూలనను సామూహికంగా చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయ్‌కుమార్ కోరారు. నేమాం గ్రామంలో శుక్రవారం ఉచితంగా ఎలుకల మందు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండల వ్యవసాయాధికారి చీకట్ల సత్యనారాయణ పర్యవేక్షణలో రూరల్ మండలంలో 13 రైతు సేవా కేంద్రాల్లో రూ.55వేలు విలువ చేసే 22 కేజీల బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా పంపిణీ చేశామన్నారు. సాయంత్రం పూట వరిచేల గట్లపై ఉన్న బొరయల్లో రైతులందరూ కలిసి ఒకేసారి మందు పెట్టాలన్నారు. అప్పుడే పంటను నష్టం చేసే ఎలుకల నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. వ్యవసాయాధికారి సత్యనారాయణ, ఏఈఓ సూర్యనారాయణమూర్తి, వ్యవసాయ అసిస్టెంట్‌లు పాల్, జోయ్, రైతులు పాల్గొన్నారు.

కరప: రబీలో ఎలుకల నివారణకు రైతులందరూ సామూహికంగా చర్యలు చేపట్టాలని కరప సబ్‌డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడీఏ) కె.బాబూరావు సూచించారు. మండలం పెనుగుదురు రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం రైతులకు ఉచిత ఎలుకల మందును అందజేసి, మాట్లాడారు. ప్రతిసీజన్‌లో బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా అందరజేస్తున్నామన్నారు. ఎంఏఓ ఏవీ రాజేష్ మాట్లాడుతూ వరిపంటలో పిలకలు తొడిగే దశ నుంచి చిరు పొట్ట దశ వరకు అన్ని దశల్లో ఎలుకలు వరి పంటకు నష్టం కలిగిస్తాయన్నారు. వాటిని నిర్మూలించాలన్నారు. మండలానికి 26 కిలోల బ్రోమోడయోలిన్ మందు వచ్చిందని, ఆర్‌ఎస్‌కేల ద్వారా రైతులకు అందజేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. తర్వాత కరప ఆర్‌ఎస్‌కే వద్ద కూడా రైతులకు ఎలుకల మందును వ్యవసాయాధికారులు అందజేశారు. వ్యవసాయ విస్తరణాధికారి బండారు శ్రీరాములు, వీఏఏ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు మాత్రలు


కరపలో జాతీయ నులిపురుగుల దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

కరప: చిన్నారులు, కిశోర బాలల ఆరోగ్య పరిరక్షణకు అమలు చేస్తున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎం.అనుపమ కోరారు. ఈనెల 10వ తేదీన అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోని ఏడాది వయసున్న చిన్నారుల నుంచి 19 ఏళ్ల లోపు వారందరితో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, గ్రామ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కరప, వేళంగి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ యాంజలిన్, డాక్టర్ ఎంకే సౌజన్యలు మాట్లాడుతూ పోషకాహార లోపంతో పిల్లల్లో రక్తహీనత కనిపిస్తుందన్నారు. నులిపురుగుల వల్ల ఆకలి మందగిస్తుందన్నారు. నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలన్నారు. కరప పీహెచ్‌సీ పరిధిలో 7,280 మంది, వేళంగి పీహెచ్‌సీ పరిధిలో 4,031 మంది ఉన్నారని వీళ్లందరితో 10న ఆల్బెండజోల్ మాత్రలు మింగించేందుకు అన్నిచర్యలు తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా జాతీయ నులిపురుగుల దినోత్సవం పోస్టర్లను ఎంపీడీఓ అనుపమ, వైద్యాధికారులు ఆవిష్కరించారు. ఎంఈఓ కె.బుల్లి కృష్ణవేణి, ఎంపీహెచ్‌ఓలు కంచర్ల వేణుగోపాలరావు, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

మా భూములు తిరిగి ఇవ్వాలి


తమ్మవరంలో నిరసన తెలుపుతున్న రైతులు

తమ్మవరంలో రైతుల నిరసన

కాకినాడ రూరల్: పరిశ్రమల ఏర్పాటుకు ఏపీఐఐసీ తమ వద్ద సేకరించిన భూములను తిరిగి తమకు అప్పగించాలని కాకినాడ రూరల్ మండలం తమ్మవరం రైతులు డిమాండ్ చేశారు. ఆ భూముల్లో ఎటువంటి పరిశ్రమలూ నెలకొల్పలేదని, ఎన్నో ఏళ్లుగా తాము పోరాడుతున్నా పట్టించుకోవడం లేదని పేర్కొంటూ తమ్మవరం పంచాయతీ కార్యాలయం వద్ద వారు శుక్రవారం నిరసనకు దిగారు. తమకు న్యాయం చేయాలని, ఏపీఐఐసీ ఎక్విజిషన్ నుంచి డీ నోటిఫై చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతు గొల్లపల్లి సత్తిరాజు మాట్లాడుతూ, తమ్మవరం రైతులు భూములు కోల్పోయి ఆడపిల్లల పెళ్లిళ్లు కూడా చేసుకోలేని దుస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములు తిరిగి ఇస్తామని గతంలో నేతలు హామీలిచ్చారని, ప్రభుత్వ పెద్దలు కలగుజేసుకుని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్టు నుంచి రక్షించిన 'చైతన్యం'

భారీ మోసం నుంచి త్రుటిలో తప్పించుకున్న విశ్రాంత ఉద్యోగి


సీఐ అప్పలనాయుడుకి ఫిర్యాదు చేస్తున్న విశ్వనాథం

కాకినాడ క్రైం: డిజిటల్ అరెస్టు స్కాం తొలిసారి జిల్లాను తాకింది. కాకినాడకు చెందిన ఓ విశ్రాంత ఉద్యోగికి సైబర్ నేరగాళ్ల నుంచి డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామంటూ ఓ ఫేక్ వీడియో కాల్ వచ్చింది. ఈ వ్యవహారంపై ఆయన పోలీసుల్ని ఆశ్రయించారు. సైబర్ నేరాలపై పోలీసులు చేపడుతున్న అవగాహనతో ఓ విశ్రాంత ఉద్యోగి తన ఖాతాలోని భారీ మొత్తాన్ని కాపాడుకున్నాడు. వివరాల్లోకి వెళితే, కాకినాడ ప్రతాప్ నగర్‌కు చెందిన 70 ఏళ్ల ఎం.విశ్వనాథం ఓ విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి ఆయన ఖాతాలో నగదు మొత్తంపై సైబర్ నేరగాళ్ల కన్నుపడింది. బుధవారం ఓ వీడియో కాల్ చేసి మీరు డిజిటల్ అరెస్ట్ అయ్యారంటూ బెదిరించారు. ఈ అరెస్టు, తదనంతర పరిణామాల నుంచి బయటపడాలంటే తమకు డబ్బు చెల్లించాలంటూ గాలం వేశారు. ఆదిలో కంగారు పడిన విశ్వనాథం అంతలోనే తేరుకుని గతంలో ఈ విషయమై పొందిన అవగాహనతో విశ్వనాథం తిరగబడి ప్రశ్నించి, హెచ్చరించారు. దీంతో బెంబేలెత్తిన సైబర్ మోసగాడు సెల్‌ఫోన్ తెర నుంచి చటుక్కున మాయమయ్యాడు. అనంతరం కుటుంబ సభ్యులతో చర్చించి వారి సూచన మేరకు టూ టౌన్ సీఐ అప్పలనాయుడిని కలసి సైబర్ కాల్‌పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీసుల మార్గనిర్దేశంలో చేపడుతున్న సైబర్ నేరాలపై అవగాహన సదస్సులు సత్ఫలితాలనివ్వడం సంతోషాన్నిచ్చిందన్నారు. సైబర్ నేరాలకు గురైన వారు 1930, 112 టోల్ ఫ్రీ నంబర్లలో ఫిర్యాదు చేయాలని, లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాలన్నారు. ఈ ఘటనపై స్పందించిన ఎస్పీ బిందుమాధవ్ సైబర్ నేరగాళ్లను ఎదుర్కొన్న విశ్వనాథంతో పాటు అవగాహన సదస్సుల ద్వారా ఆ మనోధైర్యాన్నిచ్చిన సీఐ అప్పలనాయుడిని అభినందించారు.

ప్రియురాలు అన్నయ్యా అని పిలిచిందని..

జీజీహెచ్ సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య


మద్దు వీర వెంకట సత్యనారాయణ(ఫైల్)

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే, కాకినాడ గ్రామీణం మండలం వెలమల తూరంగికి చెందిన మద్దు వీర వెంకట సత్యనారాయణ(24) నాలుగేళ్లుగా జీజీహెచ్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఓ యువతిని ప్రేమించాడు. కుటుంబాల మధ్య సయోధ్య కుదిరి పెళ్లి వరకు వెళ్లాలనుకున్నా మధ్యలో అవాంతరాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సత్యనారాయణ సోదరి సీమంతం వేడుకకు అతని ప్రియురాలు వచ్చింది. ఆ సమయంలో అన్నయ్యా అని పిలవడంతో మనస్తాపానికి గురయ్యాడని ఓ ఆడియో రికార్డింగ్ ద్వారా వెల్లడైంది. ఈ నేపథ్యంలో పురుగుల మందు స్వల్పంగా మద్యంలో కలుపుకొని సేవించాడు. నాటి నుంచి వివిధ ఆరోగ్య సమస్యలకు గురయ్యాడు. ఆదివారం ఆరోగ్యం విషమించడంతో కుటుంబీకులు కాకినాడ జీజీహెచ్‌లో చేర్చగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఘటనపై ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

పోలీసు సేవలపై విస్తృత ప్రచారం



నడకుదురులో ప్రజాసేవలో పోలీస్ పోస్టర్లను అతికిస్తున్న ఏఎస్ఐ సూరిబాబు

కరప: ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సేవలందించడమే పోలీసుల కర్తవ్యమని, పోలీసులంటే భయపడకుండా ఫ్రెండ్లీగా ఉండాలని కరప ఎస్ఐ టి.సునీత, ఏఎస్ఐ వి.సూరిబాబు కోరారు. జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాలమేరకు ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, కాకినాడరూరల్ సీఐ చైతన్యకృష్ణల పర్యవేక్షణలో పోలీసు సేవలపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్టు వారు తెలిపారు. 'ప్రజాసేవలో పోలీసు' పేరిట ముద్రించిన పోస్టర్లను కరప, పెనుగుదురు, నడకుదురు, వేళంగి తదితర గ్రామాల్లో జన సమూహం ఎక్కువగా ఉండే ప్రదేశాలలో పోస్టర్లు అతికించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. అత్యవసర సమయంలో 112 లేదా 100 ఫోన్ చేయవచ్చన్నారు. కరప పోలీసుస్టేషన్ నంబరు 08842394833, కరప ఎస్ఐ-9440796557, కాకినాడ రూరల్ సీఐ-9440796521 నంబర్లకు ఫోన్ చేసి చెప్పవచ్చన్నారు. ఏఎస్ఐ సూరిబాబు శుక్రవారం కరప, వేళంగి, నడకుదురు తదితక గ్రామాల్లో పోస్టర్లను అతికించారు.

క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలు


బాలుర విభాగంలో విజేతలతో డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ తదితరులు


బాలికల విభాగంలో విజేతలతో డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ తదితరులు

- డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్
- ముగిసిన ఐటా అండర్–16 టెన్నిస్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): క్రీడల్లో రాణించేవారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా క్రీడామైదానంలో ఐటా అండర్–16 టెన్నిస్ పోటీలు ఘనంగా ముగిశాయి. బహుమతి ప్రధాన కార్యక్రమానికి ఏపీ లాన్ టెన్నిస్ సంఘ కార్యదర్శి పీవీ రామ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ టెన్నిస్ పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఏపీ లాన్ టెన్నిస్ సంఘ కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ ఈనెల 3 నుంచి జరిగిన ఈ టోర్నీలో కర్ణాటక, తమిళనాడు, ఏపీ, తెలంగాణ నుంచి 54 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. అనంతరం విజేతలకు డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ బహుమతులు అందజేశారు. బాలుర సింగిల్స్‌లో ధ్రువ్ (తమిళనాడు) విజేతగా విన్‌సెంట్ రన్నర్‌గా, బాలికల సింగిల్స్‌లో జోహ (తెలంగాణ) విజేతగా, గౌరీశ్రీ (తెలంగాణ) రన్నర్‌గా నిలిచారు. డబుల్స్ విభాగంలో విన్‌సెంట్–తనిష్ జట్టు విజేతగా, బాలికల విభాగంలో జోహ–సవర్ధిక జట్టు విజేతలుగా కప్‌ను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గిరి, హెచ్‌ఎస్ శర్మ, రామకృష్ణారెడ్డి, టోర్నీ చీఫ్ రిఫరీ శివకుమార్‌లు పాల్గొన్నారు.

కాకినాడలో చైన్ స్నాచింగ్

కాకినాడ క్రైం: కాకినాడలో చైన్ స్నాచర్‌లు పేట్రేగిపోయారు. ఓ వృద్ధురాలి మెడలో నుంచి బంగారు తాడు తెంపుకెళ్లారు. వివరాల్లోకి వెళితే... కాకినాడ జగన్నాథపురం లంకాడి వారి వీధికి చెందిన మురమళ్ల సాయిబాబు అనే 80 ఏళ్ల వృద్ధురాలు శుక్రవారం ఉదయం 7.30 గంటలకు ఇంట్లో పూజ చేసుకునేందుకు ఇంటి బయట ఉన్న చెట్టు నుంచి పూలు కోస్తోంది. ఒక్కసారిగా ఓ ఆగంతకుడు ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె మెడలో ఉన్న రెండు కాసుల బంగారపు పుస్తుల తాడు లాక్కెళ్లిపోయాడు. ఈ ఘటనపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటి తలుపు తెరిచి..

కాకినాడ క్రైం: ఓ ఇంటి తలుపు తెరిచి బంగారు, వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు దొంగలు. వివరాల్లోకి వెళితే... కాకినాడ శ్రీరామ్‌నగర్, పురం వీధికి చెందిన ప్రమిదల గోవింద్ తన కుటుంబంతో రాత్రి ఇంట్లో నిద్రించాడు. ఉదయాన్నే లేచి చూడగా ఇంటి వెనుక తలుపు తెరిచి ఉంది. ఇంటిలో దొంగతనం జరిగిందని సందేహించి వెతకగా బీరువాలో ఉన్న 30 తులాల వెండి పట్టీలు, 8 గ్రాముల బంగారు చెవిదిద్దులు, రూ.లక్ష నగదు మాయమాయ్యాయని గుర్తించాడు. ఈ ఘటనపై కాకినాడ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా మధ్వనవమి వేడుకలు

బోట్‌క్లబ్: మధ్వాచార్యులు బదిరికాశ్రమ ప్రవేశం సందర్భంగా నిర్వహించే మధ్వ నవమి వేడుకలు కాకినాడ మధ్వ సభ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో కార్యదర్శి కోపెల్ల శేషగిరిరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత చొల్లంగి ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న మధ్వాచార్యుల విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం స్థానిక రామారావుపేటలో ఉన్న మధ్వ సభ ప్రాంగణంలో సుధా పండితులు కానుగోవి వాసుదేవా చార్ బహూకరించిన మధ్వాచార్యుల శిలా ప్రతిమకు కూడా అభిషేకాలు చేశారు. బ్రాహ్మణులకు నూతన వస్త్రాలు పిఠాపురం మైలవరపు శ్రీనివాసాచార్యులు అందించారు